

తాండూరు, మార్చి 28 : బీఆర్ఎస్ అభివృద్ధికి పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని తమ నివాసంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమన్నారు. అందుకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ నెల 30వ తేదీ శనివారం జీపీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు తప్పక హాజరు కావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మారుతున్నానని కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు. బీఆర్ఎస్‌ను వీడేది లేదని స్పష్టం చేశారు. పుకార్లు సృష్టిస్తున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# డంపింగ్ యార్డు పూర్తయ్యేనా..?

- షెడ్లు, మిషనరీ పనులు జరిగేనా..?
- గుట్టలు, గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త
- 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.82కోట్లు మంజూరైనా నిర్లక్ష్యమే..
- త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న పట్టణ ప్రజలు



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

వికారాబాద్, మార్చి 28 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులు ఉన్నాయి. ప్రతిరోజూ చెత్తను సేకరించేందుకు 17 ఆటోలు, 6 ట్రాక్టర్లు ఉన్నాయి. ఒక్క ఆటో రెండు వార్డుల్లో చెత్తను సేకరించాల్సి ఉంటుంది. డంపింగ్ యార్డు వికారాబాద్‌కు 3కిలో మీటర్ల దూరంలో వికారాబాద్ మండలం గోదుమగూడ వెళ్లే దారిలో ఉంది. గతంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు డంపింగ్ యార్డును 10 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్తను డంపింగ్ యార్డుకు చేరవేస్తున్నారు. రోజుకు 26మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు చేరుతున్నది. గతంలో 14వ ఆర్థిక ప్రణాళిక నిధులు రూ.3.82కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో డంపింగ్ యార్డు ప్రహరీ, సీసీ రోడ్లు, షెడ్లు, తడి, పొడి చెత్తను వేరు చేసే మిషనరీలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఖర్చు చేయాల్సి ఉంది. అప్పట్లో కాంట్రాక్టర్‌కు అప్పగించి పనులు ప్రారంభించారు. 2021లో వికారాబాద్ డంపింగ్ యార్డుకు రూ.18లక్షలతో సీసీ రోడ్డు పనులు చేశారు. రూ.49లక్షలతో డంపింగ్ యార్డు ప్రహరీ నిర్మించారు. డంపింగ్‌యార్డులో షెడ్డు నిర్మాణ పనులు కొనసాగాయి. షెడ్డు ఏర్పాటు కోసం పిల్లర్లను సైతం ఏర్పాటు చేశారు. సుమారు రూ.2.07కోట్లు ఖర్చు కాగా, రూ.1.75 కోట్లు మిగిలినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. డంపింగ్ యార్డులో పనులు పూర్తి చేయకపోవడంతో రోజుకు 26 మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు చేరుతుంది. దాదాపు 4 సంవత్సరాల నుండి చెత్తను డంపింగ్ యార్డులో వేయడంతో గుట్టు గుట్టలుగా పేరుకపోయింది. తడి,పొడి చెత్తను వేరు చేసే మిషన్లు అందుబాటులోకి వస్తే పొడి చెత్తను అమ్మి మున్సిపల్‌కు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి వచ్చిన నిధులను వృథా చేయకుండా నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని వికారాబాద్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్లకే పరిమితమైన షెడ్డు

## ఎండిన ఆకులతో ఆర్గానిక్ ఎరువు కేంద్రం

### కంపోస్టింగ్ ప్లాంట్‌ను సందర్శించిన రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఎండిన ఆకులను అధిక పోషకాలు గల మట్టి కండీషనర్ (ఆర్గానిక్ ఎరువు)గా మార్చే యాక్సిలరేటెడ్ ఎనరోబిక్ కంపోస్టింగ్ ప్లాంటును గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సందర్శించారు. మ్యాపిల్ టౌన్ విల్లాల్‌లో ఐఐసీటీ ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఈ టెక్నాలజీ ద్వారా మ్యాఫిల్ టౌన్ నివాసులు నెలకు సుమారు 10 టన్నుల సాయిల్ కండీషనర్‌ని తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను సందర్శించి అక్కడ గేటెడ్ కమ్యూనిటీ నుంచి వచ్చే మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్శనలో అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, డాక్టర్ ఎన్.సునందారాణి, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ బృందం డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ గంగాగ్ని రావు, డాక్టర్ శైలజ, డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఇతర వైద్యులు వెంకట మోహన్, సమీనా బేగం, ఆనంద్ కుమార్, విజయలక్ష్మి, నవీన్ కుమార్, ప్రసాద్, మ్యాపిల్ టౌన్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మ్యాఫిల్ టౌన్‌షిప్ ఓనర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు.

## దీర్ఘకాలిక రుణాల్లో రాయితీని కల్పిస్తాం

### పెద్దేముల్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్, మార్చి 28 : దీర్ఘకాలిక రుణాలు తీసుకొన్న రైతులకు వడ్డీలో 50% శాతం రాయితీని పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం తరపున కల్పించడం జరుగుతుందని పెద్దేముల్ సొసైటీ చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పెద్దేముల్ రైతు సేవా సహకారం సంఘం 46వ సర్వసభ్య సమావేశాన్ని రైతులు, సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సొసైటీ పరిధిలో ఇదివరకు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ఎల్‌టీ రుణాల వడ్డీలో 50% శాతం రాయితీని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే వానకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు సకాలంలో యూరియా, డీఏపీ కొరత లేకుండా చూస్తామన్నారు. అదే విధంగా రైతులకు కొత్తగా ఎల్‌టీ రుణాలను కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గోపాల్, పద్మమ్మ, సుగుణమ్మ, వెంకటప్ప, గెమ్యానాయక్, సొసైటీ మేనేజర్ మురళీగౌడ్, సిబ్బంది ప్రవీణ్, పెంటయ్య, ఫయాజ్, మాణెయ్య, రైతులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్



పరిగి, మార్చి 28 : పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు పి.శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పాషా గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.భక్తకుమార్ ఎన్నికయ్యారు. వారికి ఎన్నికల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పాషాలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగం, ఆనంద్‌గౌడ్, బాలముకుందం, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాములు, రామచంద్రయ్య, నరేందర్‌యాదవ్, ఖైసర్‌పాషా, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న భీమ్ దీక్షలు



నవాబుపేట, మార్చి 28 : మండల కేంద్రంలోని నారేగూడ గ్రామంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఈసారి కూడా గ్రామస్తులు భీమ్ దీక్షను కొనసాగిస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం అంబేద్కర్ వాదులు పూజలు, చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పర్మయ్య మాట్లాడుతూ అంబేద్కర్ జయంతికి నెల ముందు నుంచే ఈ భీమ్ దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే, జగ్జీవన్ రామ్, కాన్షీరామ్ వంటి మేధావులు దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ యువత, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 14 నుంచి ఏప్రిల్14 అంబేద్కర్ జయంతి వరకు రోజుకో విధంగా పూజా, పురస్కారాలు ఉంటాయని గుర్తుజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు శివరాజ్, శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం



వికారాబాద్, మార్చి 28 : వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 29న శుక్రవారం తెలంగాణ రాష్ట్ర స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించనున్నారు. వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత క్యాంపు కార్యాలయం అనువుగా ఉండే విధంగా చేర్పులు మార్పులు చేశారు. ప్రజలను కలిసే విధంగా క్యాబిన్, హాల్ ఏర్పాటు చేయించారు. శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

## రైతుల సహకారంతోనే సంఘాలు బలోపేతం

### పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి



సమావేశపు అంశాలను వివరిస్తున్న సీఈవో

బషీరాబాద్, మార్చి 28 : బంగారంపై రుణాలు తీసుకునే వారికి తులానికి రూ.45వేలు ఇవ్వనున్నట్లు నావంద్గి సహకార సంఘం చైర్మన్ అల్లాపూరం వెంకట్‌రాం రెడ్డి తెలిపారు. గురువారం సహకార కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అప్పుడే కొత్త రైతులకు అవకాశం కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వానకాలానికి ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. రైతులు సహకారంతోనే సంఘాలు బలోపేతమవుతాయని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రూ.8.33కోట్ల క్రాప్‌లోన్లు ఇవ్వటం జరిగిందన్నారు. 36.38లక్షల దీర్ఘకాలిక రుణాలను రైతులకు చెల్లించినట్లు చెప్పారు. రూ.11.86లక్షలు డిపాజిట్లు ఉన్నాయన్నారు. గోదాంల నిర్మాణం పూర్తి కావోచ్చిందని, త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్, సీఈవో బందెప్ప ఉన్నారు.

## గుంతలో పడి యువకుడి మృతి

### మారేపల్లి శివారులో ఘటన

పెద్దేముల్, మార్చి 28 : సుద్ద తవ్వకాలు జరిపి వదిలేసిన ఓ సుద్ద గని గుంతలో స్నానం కోసమని వెళ్లి అందులో పడి ఓ యువకుడి మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కె.గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన బోయిన హన్మప్ప తన వ్యవసాయ పొలానికి పనుల నిమిత్తం తన ఇద్దరు కుమారులతో కలిసి బుధవారం వెళ్లాడు. అదే రోజు సాయంత్రం పని అయిపోయిన తరువాత బోయిని హన్మప్ప చిన్న కుమారుడు గోపాల్ (34) స్నానం చేద్దామని పక్కనే ఉన్న సుద్ద గుంతలోకి వెళ్లాడు. ఎంతసేపైనా గోపాల్ బయటకి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి తండ్రి హన్మప్ప, అన్న శ్రీనివాస్ సుద్ద గుంత దగ్గరకి వెళ్లి చూడగా, గోపాల్ వారికి లభ్యం కాలేదు. దీంతో జరిగిన విషయాన్ని హన్మప్ప అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు తెలుపగా వారు అక్కడికిచేరుకొని వెతకగా గురువారం సాయంత్రం గోపాల్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి హన్మప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే సుద్ద వ్యాపారులు ప్రభుత్వం నుంచి లీజులు పొంది సుద్ద గనుల్లో తవ్వకాలను జరిపి అత్యంత లోతుగా గుంతలు తవ్వి నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి గుంతలను అలాగే వదిలివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి గుంతలను మూసివేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య

ఆర్కేపురం, మార్చి 28 : ఆర్కేపురం డివిజన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జరిగిన బ్రహ్మోత్సవాలకు మహసంస్థాన పీఠాధిపతులు శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్‌నేత దేప భాస్కర్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేశ్, బండి మధుసూదన్‌రావు, శివ, బొడ్డుపల్లి మహేందర్, శేఖర్‌యాదవ్, దుర్గాప్రసాద్, శ్రీధర్, బాలరాజు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వేశారు.. గోతులు పూడ్చడం మరిచారు

### ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు .. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



నైన్‌హిల్స్ కాలనీలో డ్రైనేజీ వేసి.. పూడ్చక పోవడంతో పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

బడంగ్‌పేట, మార్చి28: డ్రైనేజీ వేసి.. తీసిన గోతులను పూడ్చడం మర్చిపోయారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్, నైన్‌హిల్స్ కాలనీలో రూ.5లక్షతో నూతన డ్రైనేజీ వేశారు. అయితే.. కాంట్రాక్టర్ ఎక్కడి గుంతలు అక్కడే వదిలేశారు. దీంతో ఆ రోడ్డు అధ్వానంగా మారి.. పిచ్చి మొక్క లు మొలవడంతో పాములు తిరుగుతున్నాయి . మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మా రింది. రాత్రి సమయాల్లో నడవలేని పరిస్థితి నెల కొన్నది. ఇండ్లలోకి పాములువస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

### కాలనీలో పాములు తిరుగుతున్నాయి

గత ఆరు నెలల క్రితం నైన్‌హిల్స్ కాలనీ డ్రైనేజీ వేశారు. తీసిన గోతులను పూడ్చకుండా వదిలేశారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పిచ్చి మొక్కలు మొలవడంతో చెట్లపొదల మధ్య పాములు తిరుగుతూ ఇండ్లలోకి వస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. ప్రమాదకరమైన విషసర్పాలు తిరుగుతున్నాయి. దీంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయాల్లో భయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది.

– శ్రీను నాయక్, నైన్‌హిల్స్ కాలనీ



ఓయూ అకాడమిక్ సెనేట్ సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ప్రొఫెసర్ వి.అప్పారావు

# 44.68 కోట్ల లోటుతో ఓయూ బడ్జెట్

**బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు**

**2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.796.45 కోట్లతో ప్రతిపాదనలు**

**93.7 శాతం నిధులు వేతనాలు, పెన్షన్లకే..**

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 28: ఉస్మానియా యూనివర్సిటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన వార్షిక బడ్జెట్‌ను గురువారం నిర్వహించిన అకాడమీ సెనేట్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఓయూ బడ్జెట్‌లో మొత్తం ఆదాయం రూ.718.86 కోట్లుగా చూపెట్టారు. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ. 32.91 కోట్ల ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో కలిపి మొత్తం రూ.751.77 కోట్ల నిధులు అందుబాటులో ఉండగా, వ్యయం రూ.796.45 కోట్లుగా చూపెట్టారు. రూ.44.68 కోట్ల లోటుతో బడ్జెట్‌ను ఆమోదించారు. ఇందులో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ రూ.487.03 కోట్లు, మిగిలిన నిధులను యూనివర్సిటీ అంతర్గతంగా సమకూర్చుకోనుంది. ఓయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో అకాడమిక్ సెనేట్ జరిగిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ నివేదికలో గత సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, తీసుకున్న ప్రత్యేక చర్యలు, తదితర వాటిని వివరించారు. యూనివర్సిటీ నిర్వహించనున్న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ల గురించి పేర్కొన్నారు. అనంతరం ఓయూ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకాభిప్రాయంతో ఆమోదించారు. ఓయూకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుంచి రూ.487.03 కోట్ల బ్లాక్ గ్రాంట్ మంజూరు కాగా, గతేడాది ఓపెనింగ్ బ్యాలెన్స్ రూ.32.91 కోట్లుగా ఉంది. యూనివర్సిటీ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్ బకాయిలు చెల్లించేందుకు ప్రత్యేక గ్రాంటు రూపంలో ప్రభుత్వం నుంచి రూ.55.00 కోట్లు మంజూరైంది. మిగిలిన మొత్తం వర్సిటీ భరించాల్సి ఉంటుంది. ఇందులో రూ.35.63 కోట్లు అంతర్గత ఆదాయాల ద్వారా, ఎగ్జామినేషన్ బ్రాంచ్, యూనివర్సిటీ ఫారెన్ రిలేషన్స్ ఆఫీస్, పీజీఆర్‌ఆర్‌సీడీఈ, డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అడ్మిషన్స్, డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, టీఎస్‌పీజీఈటీ కన్వీనర్ తదితర సంస్థల నుంచి నిధుల మళ్లింపు ద్వారా రూ.138.50 కోట్లు, లోన్లు, అడ్వాన్సుల వసూల ద్వారా రూ.2.70 కోట్లు సమకూర్చుకుంటామన్నారు. మొత్తం బడ్జెట్‌లో అధ్యాపకులు, ఉద్యోగుల వేతనాలకు రూ.451.28 కోట్లు కాగా, పెన్షన్లకు రూ.295.00 కోట్లు కేటాయించారు.

అదే విధంగా ఆకస్మిక అవసరాలకు రూ.47.17 కోట్లు, ఉద్యోగుల లోన్లకు రూ.3.0 కోట్లు కేటాయించారు.

### బడ్జెట్‌లో సింహ భాగం వేతనాలు, పెన్షన్లే..

యూనివర్సిటీ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో సింహ భాగం ఉద్యోగుల వేతనాలు, పదవీ విరమణ చేసిన వారి పెన్షన్లకే సరిపోతోంది. ఉద్యోగుల వేతనాలకు రూ.451.28 కోట్లు అవసరముండగా, ఇది వర్సిటీ మొత్తం బడ్జెట్‌లో 56.66 శాతం కావడం గమనార్హం. అదే విధంగా పెన్షన్లకు మరో రూ.295.00 కోట్లు కేటాయించగా, ఇది 37.04 శాతంగా ఉంది. మిగిలినదాన్లో 5.92 శాతం కాంటింజెన్సీకి, 0.38 శాతం ఉద్యోగుల రుణాలకు కేటాయించారు. అయితే, వేతనాలు, పెన్షన్లకు మొత్తం బడ్జెట్‌లో 93.7 శాతం పోతోంది. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ఈ శాతం 65.75గా ఉండగా, ఉద్యోగులకు వేతనాలు పెరిగిన దృష్ట్యా వర్సిటీపై మరింత భారం పడింది.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client, M/s. Rubrick Constructions Private Limited, CIN - U70102TG2008PTC059346, a company registered under the Companies Act, 1956 having its registered office at Pardha's Picassa, 5th Floor, Plot No. 7 & 8, Durgam Cheruvu Road, Madhapur, Hyderabad -500081, who's Managing Director, Mr. D. Krishna Rao (holding on behalf of the Company) had lost the original property Link document bearing No. 2536 of 2014 dated 22-08-2014, duly registered before Joint Sub Registrar of Assurances – Maheswaram, which is pertaining to the 1/3rd Undivided share in the Agriculture Land i.e., admeasuring Ac.0-26.667 Gts. or equivalent to 66.667 Cts. from out of Ac.002-00 Gts. covered by Sy. Nos. 46, 47, 48 & 53 (situated in one and the same boundaries) of Mankhal Revenue (V) & GP, Maheswaram (M) Rangareddy (D), bounded by North: Land of Sy. No. 44 of K. Nardimha Reddy, South : Land in Sy. No. 59 & 54 belongs to Landowners, East: Land in Sy. Nos. 47, 46 & 52 and 30 Ft. Existing Road in Sy. Nos. 48,49, 51 & 52, West: Land belongs to Landowners in Sy. No. 61 which belongs to Vendor / Landowner of my Client, while he was traveling on 20th March 2024 from Kompally to Madhapur. Upon reaching his office, he realised that the said document is missing.

If any person/s finds the said property link document bearing No. 2536 of 2014 dated 22-08-2014, duly registered before Joint Sub Registrar of Assurances- Maheswaram, the same may be handed over to the undersigned as a law abiding citizen. Further the above said original document shall not be abused or mis-used or otherwise utilized by unauthorized person. If any unautho-rized person makes misuse of it, the same shall not bind my Client. Hence, this Public notice.

**P. PAVAN KUMAR RAO,**
**For M/s SR Legal Partners,**
**Advocates & Legal Consultants**
4th Floor, Park View Edifice, Nandagiri Hills, Road No.1, Jubilee Hills, Hyderabad-500033, +91-40-48910484, pavanrao@srlegal.in

## జేఎన్టీయూహెచ్‌తో వాధ్వని ఎంఓయూ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 28: జేఎన్టీయూహెచ్ వర్సిటీలో ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నేషనల్ ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ నెట్‌వర్క్ (ఎన్ఈఎన్) బెంగళూరు, కర్ణాటక సంస్థతో జేఎన్టీయూహెచ్ వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు వ్యవస్థాపక నైపుణ్యాలు, మనస్తత్వాన్ని పెంపొందించడం, ఆచరణాత్మక అవగాహనతో శక్తిమంతం చేయాల్సి ఉంటుంది. వాధ్వని సంస్థ వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల ఆలోచనకు తగిన శిక్షణలివ్వడం విద్యార్థుల ఆలోచనకు పదనుపెట్టి వారిచేత స్టార్టప్ కంపెనీల ఏర్పాటుకు ఉచితంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సంస్థ దేశంలో పలు యూనివర్సిటీల్లో, ఎన్ఐటీలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ డైరెక్టర్ ఆర్.శ్రీదేవి, వర్సిటీ ప్రొఫెసర్ ఎన్.వెంకటరమణ, పీఆర్వో ప్రసన్నలు, నేషనల్ ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ నెట్‌వర్క్ ప్రాంతీయ డైరెక్టర్ సోనాలి అగ్నిహోత్రి, ప్రొగ్రామ్ మేనేజర్ అమిత్‌సింగ్‌లు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

## సాహిత్య విమర్శపై అధ్యయన శిబిరం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 28: సాహిత్య విమర్శపై తెలంగాణ సారస్వత పరిషత్తు త్వరలో అధ్యయన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య గురువారం తెలిపారు. ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో విమర్శకు ఎంతో ప్రాధాన్యం ఉన్న దృష్ట్యా విమర్శ చేసే వారికి తగిన అవకాశం కల్పించడం కోసం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విమర్శ, విమర్శకుడు, విమర్శ రీతులు, ఆధునిక సాహిత్య విమర్శ వికాసం, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర, పరిశోధన భేదం సాదృశ్యాలు, విమర్శ ధోరణులు తదితర అంశాలపై ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రసంగాలు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు తక్షణమే ఫోన్ నం: 96037 27234కు వాట్సప్ ద్వారా తమ వివరాలను పంపి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

## నగరంలో రవీనా సందడి



మెహిదీపట్నం గుడిమల్కాపూర్ కింగ్ ప్యాలెస్‌లో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా ఏర్పాటు చేసిన రంజాన్ ఫెస్టివల్‌ను బాలీవుడ్ హీరోయిన్ రవీనాటాండన్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. రంజాన్ ఫెస్టివల్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. – మెహిదీపట్నం మార్చి 28

## దివ్యాంగులకు 30న బస్‌పాసుల మేళా

సిటీబ్యూరో, మార్చి 28(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మనోహరాబాద్ మండల కార్యాలయంలో ఈ నెల 30న దివ్యాంగుల బస్సు పాసుల స్పెషల్ క్యాంప్ మేళాను నిర్వహిస్తామని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగులకు బస్సు పాసులు జారీ చేస్తామని ఆయన తెలిపారు. మనోహరాబాద్, పాలాట, ధర్మరాజుపల్లి, కునాయిపల్లి, కూచారం, పోతారం, జీడిపల్లె, దండుపల్లి, లింగారెడ్డి పేట్, చాట్ల గౌరారం, కొండాపూర్, పరికి బండ, రామాయపల్లి, రంగాయిపల్లి, ముప్పిరెడ్డి పల్లి, అగ్రహారం తదితర పరిసర ప్రాంతాల్లో నివసించే దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగులు వారితో పాటు ఒక పాస్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఐడీ కార్డు, సర్వీస్ ఛార్జ్ రూ.50 తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు.